# ఇద్దరూ మిత్రులే!



''డియర్ గోపాలం!

సుమారు ఇరవై సంవత్సరాల తరువాత నీకు ఉత్తరం రాస్తుంటే—ఏమిటో మాటల్లో చెప్పలేకపోతున్నాగానీ... మనసంతా అదో విధమైన అనుభూతి నిండి ఉంది. ఈ అనుభూతి అనిర్వచనీయమైంది. నేను రాయఘడ్‌లో ఉండగా నెలకోసారి నువ్వు రావటమో, నేనే నీదగ్గరకి రావటమో జరిగేది! నెలకి రెండు మూడుత్తరాలయినా రాసుకుంటూ ఉండేవాళ్లం! ఒక ఉత్తరానికి జవాబుగాని నేను రాయకపోతే నీ నుంచి నాలుగు పేజీల ఉత్తరం నాకు ప్రత్యక్షమయ్యేది. ఆ తరువాత నేను కోరాపుట్, జైపూర్, నవరంగ్‌పూర్... ఇలా ఊళ్లు మారిపోతుంటే క్రమేపీ మనం కలుసుకోవటం దూరం అయిపోయింది. ఇదిగో... ఈ కుగ్రామం వచ్చి సుమారు ఇరవై సంవత్సరాలయిపోతోంది. అప్పట్నుంచీ మన మధ్య పూర్తిగా ఉత్తరాల రాకపోకలు కూడా తగ్గిపోయాయి.

కాలం చాలా చిత్రమైనది కదూ?

ఎలాటి ప్రేమలనీ, విషాదాన్నీ, గాయాన్నీ, అనుబంధాలనీ ఇట్టే మరిపింప చేస్తుంది. అనంతమయిన ఈ కాల ప్రవాహంలో మన స్నేహం ఒక అనుభూతిగా మాత్రమే మిగిలి, అప్పుడప్పుడు కలలాగా కూడా అనిపిస్తుంటుంది!

ఈ ఇరవై సంవత్సరాల కాలంలో ఊహించినవి ఎన్ని తారుమారైనాయ్? ఊహించనవిఎన్నిజరిగిపోయాయ్?

ఈ మధ్య కొద్ది రోజులుగా నిన్ను కలుసుకోవాలనీ, నా మనసంతా నీ ముందుంచి తనివితీరా మాటాడాలనీ, మనిషిని తేలికగా అయిపోవాలనీ, పాత జ్ఞాపకాల ఆనంద డోలికలలో తేలియాడాలనీ ఎంతలా పరితపిస్తున్నానో తెలుసా? ఇన్ని ఊర్లు తిరిగానా? మనసు విప్పి మాట్లడుకోటానికో మంచి మిత్రుణ్ణి సంపాయించుకోలేకపోయాను!

సరే. నేను 15వ తారీఖున బొకారోలో వస్తున్నా. రైల్వే వాళ్ల ధర్మమాని కరెక్టుగా వస్తే 12 గంటలకి మనం కలుసుకుంటాం. తప్పక వస్తావుగా! వస్తున్నట్టు ఈ ఉత్తరానికి జవాబుగా ఓ కార్డు ముక్క రాసి పడేయ్. అలా అయితే నా ఉత్తరం నీకందినట్టు లెక్క! మరి ఉంటారా!

రామారావు.

* * * *

మిత్రుణ్ణి రిసీవ్ చేసుకోడానికి స్టేషన్‌కొచ్చిన గోపాలం మిత్రుడు వ్రాసిన ఆ ఉత్తరాన్ని అప్పటికి అరడజను సార్లయినా చదువుకోనుంటాడు. మళ్లీ సరిగ్గా చదవనట్లు అనిపించి మళ్లీ చదివాడు. తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. మనసు గాలిలో గువ్వపిట్టలా తేలిపోతోంది. మూడు గంటలు ఆలస్యం అని చెప్పిన స్టేషన్ మాస్టరు ట్రైన్ రావటానికి మళ్ళీ మరో మూడు గంటలే ఆలస్యం అని మధ్యాహ్నం మూడు గంటలకి మెల్లగా చెప్పాడు. గోపాలం అక్కడే చతికిలబడిపోయాడు.

'రామం బాగా మారిపోయి ఉంటాడు! జుట్టు నెరిసిపోయి ఉంటుంది. లేక బట్టతలే వచ్చేసిందో? వాడయినా హాయిగా ఉన్నాడో లేక నాలాగే సంసార బందిఖానాలో బందీ అయిపోయాడో?'— గోపాలం మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది. అతని స్మృతి పథంలోకి పాత జ్ఞాపకాలు దొర్లుకుంటూ వచ్చాయి.

* * *

రామారావ్ చాలా హడావుడిగా వచ్చాడు. అసలు రామారావు ఎప్పుడొచ్చినా హడావుడిగానే వస్తాడు. దానికి పూర్తిగా విరుద్ధం గోపాలం తత్త్వం. మిన్ను విరిగి మీద పడినా చలించని తత్వం!

''గోపీ! శ్రీ శ్రీగారొస్తున్నారు. విశాఖపట్నం. వెళ్తున్నానేమ. వస్తావా నువ్వు?''

''ఏమిటిరా ఆ తొందర! కాస్త మెల్లగా,సావధానంగా చెప్పరాదట్రా?''

''ముందు నాకు సమాధానం చెప్ప. వస్తావా రావా?''

''ఎవరూ? అగ్గిపుల్లా, కుక్కపిల్లా కవితా వస్తువులని చెప్పిన రష్యా కవిగారేనా?'' గోపాలం ఆ మాటలు అనే సరికి రామారావు ముఖం దివ్యంగా వెలుగుతున్న పెళ్లి పందిరి మంటల మయం అయినట్లయింది. కళ్ళు అగ్ని గోళాలే అయినాయి.

''నీకిష్టం లేకపోతే మానెయ్. ఫరవాలేదు. కానీ... ఒక మహా కవిని నువ్వంత తేలికగాఅంటే ఒప్పకోను'' అన్నాడు వస్తోన్న ఆవేశాన్ని దిగమ్రింగుతూ

''ఏంటోయ్ మహాకవీ... మహాకవీ అంటూ తెగ మురిసిపోతావ్. అతనెవరికంటే మహాకవి? ఒక తిక్కనకంటేనా? ఒక పోతన కంటేనా? ఓ శ్రీ నాథునికంటేనా? వాళ్లే మహాకవులని చెప్పకోలేదెక్కడా? అంతా కవులము కామా? అంతంతగ కంద పద్యమల్లగలేమా?' అని కొన్ని గేయాలు రాసేసి మహాకవులయిపోయారంటే నేనంగీకరించను!'' అన్నాడు గోపాలం.

''అవునులే.నిరుపహతి స్థలం...ఊయలమంచం... ఉంటే... సానిదాంతో సరసాలాడుతూ... ఎక్కడో విహరిస్తూ... ప్రేయసి మెల్లకన్నుల మీద కవిత్వం చెప్పేవాళ్లే నీకుమహాకవులవుతారుగానీ...సామాజికస్పృహతో పతితుల్నీ, భ్రష్టుల్నీ ఏడవకండని వాళ్ల బాధల గాథల కోసం సామాజిక ప్రయోజనంతో కవిత్వం చెప్పేవాళ్లు నీలాంటి వాళ్ల దృష్టిలో కవులెలా అవుతారు?



# పి.వి.బి.శ్రీరామమూర్తి

అందుకే చలంగారేం చెప్పారో తెలుసా? శ్రీ శ్రీ మహా ప్రస్థానం పుస్తకం కొని తీరికగా చదవమన్నాడు. అర్థంకాపోతే ఓ యువకుడికో, భిక్షుకునికో డెత్‌బెడ్ ప్రెజెంట్‌గా పంపమన్నాడు. లేకపోతే మహాప్రస్థానం పుస్తకాన్ని దాచుకొని పదేళ్లాగి పిల్లల్ని కనడం, ధరలు హెచ్చడం గాక జీవితంలో ఏమన్నా మిమ్మల్ని అమితంగా ఇన్‌ఫ్లుయెన్స్ చేస్తే, మళ్లీ మహాప్రస్థానం కొత్త కాపీ కొనుక్కొని చదవమన్నారు! అందులోంచి శ్రీ శ్రీ గారు గానీ, అతని రచనలు గానీ ఈ స్థితిలో నీకు గొప్పవిగా కనిపించక పోవచ్చు. సర్లే. నీలాటి ఛాందసులతో వాదించటం నా బుద్ధి తక్కువ''.అని సీరియస్‌గా లేచిపోయాడు.

ఆ తరువాత వారం రోజులు రామారావ్ మళ్లీ కనిపించలేదు. రామారావు గోపాలం ఏదో విషయం మీద వాదించుకోవటం బాగా అలవాటు. ఆ వాదనలో రామారావు బాగా ఇరిటేటయి కొన్నాళ్లు కనిపించక పోవటం, తరువాత వచ్చి మళ్లీ మామూలుగా కలిసిపోవటం అలవాటు.

* * *

గోపాలానికి చిన్ననాటి సంఘటన లీలగా కళ్లముందు కదిలింది. మనసంతా అనుభూతుల అమృతపు వానలో తడిసింది.

గోపాలానికి రామారావ్‌కీ చాలా అభిప్రాయాలలో భేదాలున్నాయి గోపాలానికి ఆధునిక కవిత్వం అంటే ఇష్టం ఉండదు. ప్రాచీన కవులూ, చమక్కులూ ఇష్టం.

గోపాలానికి దేవుడంటే భక్తి దెయ్యం అంటె భయం! రామారావ్ హేతువాది. ప్రతి విషయాన్నీ హేతువాదపు దృష్టితో ఆలోచించాలి అంటాడు. లేకపోతే మనవాళ్లు పాత భావాలతో బూజు పట్టి ఎన్నటికీ సంపన్న దేశం కాజాలదంటాడు! స్త్రీ జాతిని అణచేసినంతకాలం ఈ దేశానికి పురోభివృద్ధి జరగదంటాడు రామారావ్. నిజానికి రామారావు అభిప్రాయాల్లో కొన్నింటితో గోపాలం ఏకీభవిస్తాడు కానీ, అతనితో వాదించి ఉద్రేక పరచటం కోసం అలా వాదిస్తుంటాడు గోపాలానికి అదో సరదా!

* * *

అర్ధగంట సేదతీర్చుకున్న హుషారులో ట్రెయిన్ గొప్ప జోరుగా పరుగుతీస్తోంది. కిటికీ లోంచి గాలి రివ్వున వచ్చి చెవుల్లోకి దూసుకుపోతోంది. కంపార్టుమెంటులో కొందరు చలికి కిటికీ అద్దాలు దించమంటున్నా ప్రక్కన కూర్చున్న యువకులు వాళ్లమాట వినటం లేదు. రామారావ్‌కీ చలిగా ఉన్నా అద్దాలు వాళ్లు దించటం అతనికిష్టంలేదు. ట్రైన్లో ప్రయాణం చేయటం రామారావ్‌కి ఒక అనుభూతి అయితే కిటికీ దగ్గర కూర్చోటం మరో వింత అనుభూతి!

సాధారణంగా— జోరుగా ట్రైన్ పరుగుతీస్తున్నపుడు— కిటికీలోంచి మిలమిలా మెరిసే నక్షత్రాలు, పరుగుతీస్తున్న పచ్చని చెట్లు, గిర్రున తిరుగుతున్న ఆకాశం రామారావ్‌కెంత సేపు చూస్తున్నా తనివి తీరదు! వాటికి మానవ జీవితానికి సామ్యం కనిపిస్తుంది. ఎక్కడో అనంతాకాశంలో మిలమిలా మెరిసే నక్షత్రాలు మానవుడి తరగని కోరికల్లా కనిపిస్తాయి. ట్రైన్ ముందుకు పోతుంటే వెనక్కి పోయే పచ్చని చెట్లు వెనక్కి పోతున్న యవ్వనంలా కనిపిస్తుంది. గిర్రున తిరిగే ఆకాశం ఆశల వలయంలో పరిభ్రమించే మానవునిలా కనిపిస్తుంది. అందుకే— అలా ఎంతసేపయినా ఆ దృశ్యాలని చూస్తుండటం రామారావుకెంతో ప్రీతి!

చాలా సేపు ఆ ఆనందాన్ని ఆస్వాదిస్తూ కూర్చున్నాడు.

తరువాత కొంత సేపు ఏం తోచలేదు.

జేబులోంచి గోపాలం వ్రాసిన ఉత్తరం తీసాడు. లైటు వెలుగులో చదవబోతే అది గోపాలం వ్రాసింది కాదు. తన కూతుర్ని చేసుకోడానికి కట్నం కావాలని అమలాపురం నుంచి పెళ్లి పెద్ద వ్రాసిన ఉత్తరం అది.

రామారావ్‌కి ఒళ్ళుమండింది.

'ఎమ్.ఏ పాసయి లెక్చరరుగా పనిచేస్తోన్న పుత్రుడికి బొమ్మలాటి పిల్లని... తన కూతుర్ని చేసుకోడానికి పదిహేనువేలు కట్నం కావాలట! వీళ్లబ్బ సొమ్ము దాచపెట్టారు!

పదిహేను వందలు సంపాదిస్తోంది చాలక ఇంకా పదిహేను వేలు కట్నం పోయాలట! నా కూతురు పెళ్ళెలా కాదో చూస్తాను.

బంగారం లాటి సంబంధం ఉండగా డబ్బుకోసం కక్కుర్తిపడే కిరాతకులకి నా కూతుర్ని ఇవ్వమన్నా ఇవ్వను!

ఇన్నాళ్ళు తనకి గుర్తేలేదు!

అందుకే— 'కొన్ని విషయాల్లో మగాళ్ల కంటే ఆడవాళ్లకే ముందు చూపు! అన్నపూర్ణ చెప్పిందాకా గోపాలం గాడి కొడుకు విషయమే తనకి గుర్తులేదు.

'గోపాలం కొడుక్కి కొంపతీసి పెళ్లయిపోలేదు కదా?' ఆ ఆలోచన రావటంతో మనసంతా వికలమయిపోయింది. కానీ 'పెళ్లి చేస్తే కనీసం శుభలేక పంపక పోడు' అన్న సమాధానం కొంత ఊరట కలిగించింది.

గోపాలం కొడుకు పోస్టుగ్రాడ్యుయేషన్ కూడా చేసినట్టు ఆ మధ్య ఎవరో చెప్పినట్టు గుర్తు! ఇదే జరిగిపోతే నిజంగా ఎంతో అదృష్టమే. ముచ్చటయిన జంట!

గోపాలం అప్పట్లో అనేవాడు—'ఆధ్యాత్మిక చింతన మానసికోల్లాసాన్నీ— శాంతిని' కలిగిస్తుందనేవాడు. అది ఇప్పుడు నిజం అనిపిస్తోంది.

ఈ చార్వాకంవలనే తనకీకష్టాలన్నీ వస్తున్నాయేమో?

"తండ్రీ! ఈ పెళ్లి అనుకున్నట్లు జరిగిపోతే కుటుంబ యాత్ర చేసుకుంటా": మనసులోనే శ్రీనివాసుణ్ణి తలుచుకొని మ్రొక్కుకున్నాడు.

సరిగ్గా—

అదే సమయానికి మిత్రుని రాక కోసం ప్రతి నిమిషం టైం చూసుకుంటున్నాడు గోపాలం.

లైన్ క్లియర్ ఇచ్చాడు. బండి మరి కొద్ది సేపట్లో వచ్చేస్తోంది.

గోపాలం మనసు ఎంతో ఆహ్లాదంగానూ, ఆందోళనగానూ ఉంది. 'రాక రాక వస్తున్నాడు రామారావ్! అతని కొడుక్కి తన కూతుర్ని చేసుకోమనటం సబబుగా ఉంటుందా? ఏమిటో కాంతం అడగమని వేధిస్తోంది గానీ— మిత్రులని తన అవసరాలకి వాడుకోవటం ఏం బాగుంటుంది?

తీరా వాడు ఒప్పుకోకపోతే తనెంత ఇరకాటంలో పడిపోవాలి? సంబంధం విషయం కోసం స్నేహాలు తుంచుకోలేం కదా? ఒకవేళ వాడు ఒప్పుకొన్నా— వాళ్లావిడ ఏమంటుందో? పిల్లాడు ఇష్టపడాలి కదా?

పూర్వం రోజులలో అయితే తలిదండ్రులకు పిల్ల నచ్చితే పిల్లలకి నచ్చినట్టే తనైతే కాంతాన్ని పెళ్లివాడే చూసాడు.

ఏమిటో? తానొకటి తలిస్తే దైవం ఒకటి తలచినట్లు' జరుగుతోంది ప్రతి విషయంలోనూ! అసలు ఒకోసారి దైవం ఉన్నాడా అనిపిస్తుంది.

చాలా విషయాల్లో రామారావ్ అభిప్రాయాలేనిజం అనిపిస్తాయి. 'నిజానికి దైవం అంటూ ఉంటే— ఎవరికీ అన్యాయం చేయని తననెందుకింత కష్టపెడతాడు'

—ఆలోచనల్ని కట్ చేస్తూ ట్రైన్ పెద్ద కూతతో వచ్చి ఆగింది. గాబరాగా ప్రతి పెట్టె చూసుకుంటూ పరుగెత్తాడు. దూరం నుంచి 'గోపాలం' అన్న పిలుపు వినిపించి అటువైపు పరుగుతీసాడు.

రామం గోపాలాన్నిట్టే గుర్తు పట్టేశాడు.

కానీ ముచ్చటగా కనిపించే రామారవ్ క్రాఫ్ ఇప్పుడు మూడు వెంట్రుకలు మాత్రమే మిగిలి ఉన్నగా మెరిసిపోతుండటం వలన గోపాలం అంతవేగిరం గుర్తుపట్టలేకపోయాడు రామాన్ని!

"ఏరా గుర్తుపట్టలేదా?" ఇరవై సంవత్సరాల తరువాత కలుసుకున్న మిత్రులిద్దరూ స్టేషన్లోనే అన్ని విషయాలూ మాట్లాడేసుకోవాలన్న తపనతో ఉన్నారు.

రామారావ్ భుజాన్ని గట్టిగా చరుస్తూ గోపాలం

"ఎంతలా మారిపోయావ్‌రా! బట్టతల కూడా బాగా వచ్చేసిందే? అసలుగుర్తేపట్టలేకపోయానోయ్" అన్నాడు.

"వచ్చేవయసా? పోయే వయసా? వెధవ బట్టతల మాటకేం గానీ— అంతా క్షేమమేనా? ఏంటిరాపూర్తిగా ఉత్తరాలే రాయటం మానేసావ్! అసలు నేను గుర్తున్నానా?" అక్కణ్ణించి స్టేషన్ బయటికి వచ్చి రిక్షా ఎక్కారు. ఇంటికి చేరుకున్నారు.

చాలా సేపు చిన్ననాటి కబుర్లు ముచ్చటించుకున్నారు.

తరువాత కష్ట సుఖాల్లో పడ్డారు. కొంత సేపు మారుతున్న దేశ రాజకీయాలని ముచ్చటించుకున్నారు. గోపాలం 'తెలుగుదేశం' ఆంధ్రలో పరిపాలన— ఎన్టీయార్ వల్ల తనకి కలిగిన దెబ్బని వర్ణిస్తూ— "గొప్ప దెబ్బ కొట్టేసాడురా! ఇంకా మూడు సంవత్సరాలు టైం ఉందిగదా అని—కొంత ధైర్యంతో ఉండేవాణ్ణి. పిల్లల చదువులా కంప్లీట్ కాలేదు. ఆడపిల్లల పెళ్ళిళ్లా కాలేదు. ఏ పనీ ముగించుకోకుండానే ఉద్యోగం ఊడిపోయింది. ఎక్కడ సమస్యలక్కడే ఉండిపోయాయ్. సర్లే! తరువాత వాటి గురించి మాట్లాడుకోవచ్చు. 'నిత్యం చచ్చే వాడిని చూసి ఎవరేడుస్తారన్నట్లు' ఇవెప్పుడూ ఉండేవే. అప్పుడు అనేవాడివి. ఒరిస్సా వెళ్లి చాలా కష్టాలు కొని తెచ్చుకున్నానని. ఇప్పుడు నువ్వూ ఇక్కడే ఉంటే ఈ పాటికి మా రిటైర్డ్ ఎంప్లాయీస్ లిస్టులో చేరేవాడివిగా!" అన్నాడు గోపాలం.

"అన్నయ్యగారూ! లెండి. కాళ్లు కడుక్కోండి. భోజనం చేసి మాట్లాడుకోవచ్చు" అంది కాంతం.

అక్కడికి ఆ సంభాషణకి ఫులుస్టాప్ పెట్టి భోజనానికిలేచారు.

భోజనాల దగ్గర పిల్లలందరూ 'మామయ్య'పక్కన నేను కూచుంటానంటే నేను కూచుంటానని పోట్లాడుకుంటే కాంతం వాళ్లని కేకలేసింది.

"ఫరవాలేదమ్మా. చిన్న పిల్లలు. వాళ్ల సరదా మనం ఎందుకు కాదనటం?" అని గోపాలం చిన్న కూతుర్ని దగ్గరకి తీసుకున్నాడు. "ఆ! మీ పెద్దాడేం చేస్తున్నాడురా?" అడిగాడు రామారావ్.

"ఎమ్మెస్సీ పూర్తి చేసాడు. ఇక్కడే కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నాడు"

"అయితే ఇంకేం? నువ్వు రిటైరైనా కొడుకు చేస్తున్నాడుగా" అన్నాడు. ఆ అనటంలో ఎంతో ఆనందం తొణికిసలాడింది. 'తన కూతురుకి తగిన వాడే' అనుకున్నాడు.

"ఎవరికాళ్లమీద వాళ్ళు నిలబడటంలో ఉన్న తృప్తి ఇంకొకళ్ల అధీనంలో బ్రతకటంలో ఉండదు కదా?" అన్నాడు.

వాళ్ల సంభాషణని పొడిగించనివ్వటం కాంతం ఇష్టపడలేదు.

"అన్నయ్యగారి తిండి బొత్తిగా తగ్గిపోయింది". అని మరికొంచెం అన్నం వేసింది.

"ఆ...ఆ... చాలు చాలు. నిజమే మా పెద్దాడు సడన్‌గా పోయిన్నాటి నుంచీ నాకు ఏ విషయం మీదా ఆసక్తి సన్నగిల్లిపోయిందిరా!" అన్నాడు.

"ఆ..." చేతిలో అన్నం గరిటను అలానే ఒదిలేసి నిల్చుండిపోయింది కాంతం. గోపాలం మనసులో ఆలోచనల సినిమా రీలుకట్టయిపోయి డిమ్ముగా అయిపోయాడు. కొద్ది క్షణాల్లో తేరుకొని "ఏం? ఎప్పుడు? కనీసం ఉత్తరం కూడా రాయలేదేం?" అన్నాడు.


"నా జీవితంలో ఊహించని దెబ్బరా అది. దాంతో మా జీవితాలే కాంతి రహితంగా అయిపోయాయి. ఎనిమిది సంవత్సరాలయింది. బి.ఎస్సీ సెకెండియర్ చదువుతూ..." అతని గొంతు దుఃఖంతో మూగవోయింది. గొంతులో ముద్ద దిగలేదు. కళ్లలో నీటి పొరలు క్రమ్ముకు వచ్చాయి. "అయిపోయిందిరా! వాడు పోయిన్నాడే మా ఆశలు తెగిపోయాయి. నేనింకా ఇప్పుడిపుడు కాస్త ఆ విషయాన్ని బలవంతాన మరిచిపోగలుగుతున్నా. మీ చెల్లెమ్మ మాత్రం తట్టుకోలేదు. నిద్రాహారాలు కొన్ని రోజులుండకుండానే గడిపేస్తుంది. అక్కడికీ దాన్ని గతంలోకి జారనివ్వకుండా మా పెద్ద పాప జాగ్రత్తపడుతూనే ఉంటుంది" ఆ మాటలు చెప్పి గుండె బరువు కొంత తగ్గించుకున్నాడు. అన్నం మరి హితవుకాక చేతిని కడుక్కొని లేచాడు.

గోపాలం కాంతం కళ్లలోకి చూశాడు.

కాంతం కళ్లు పైట చెంగుతో ఒత్తుకుంది.

"పిచ్చి కాంతం! మన కంటె 'శనిగాడే' ముందుగా వచ్చి కూర్చుంటే మనం ఏం చేయగలం?' మనసులోనే అనుకున్నాడు గోపాలం.

భోజనాలయి పోయాయి.



రాత్రి పదిన్నర గంటలయింది.

రామారావు గోపాలం మాట్లాడుకుంటున్నారు. వాళ్ల దగ్గరే కాంతం, పిల్లలూ కూర్చున్నారు.మాట్లాడు కుంటున్నారు. అంతలో వాళ్ల ఎదరగా ఉన్న గదిలో నుంచి ఒక యువతి వచ్చి "సరళా... సరళా!" అని కేకేసింది.

"పడుకుందమ్మా. ఏంకావాలి?" అనడిగింది కాంతం. "నాకేం అక్కర్లేదు. టైం పదకొండు అవుతోంది. నేను పడుకోవాలా? అక్కర్లేదా?. ఎదుట వాళ్లు పడుకుంటారు కాస్త మెల్లగా మాట్లడుకోవాలనే ఇంగిత జ్ఞానం లేకపోతే ఎలా? వెధవ కొంప". అనేసి లోనికెళ్లి తలుపు దభేలున వేసుకుంది.

అంతే. వాళ్ల మాటలకు గడియలు పడిపోయాయి.

రామారావుకి చాలా బాధనిపించింది. "పెద్దా చిన్నా తారతమ్యం లేకుండా ఎంతలేసి మాటలంది? ఎవర్రా ఆమె?" అడిగాడు.

"ష్. మెల్లగా. వింటే మళ్లా గొడవవుతుంది. పద. డాబామీదకి పోదాం". అని అక్కణ్ణించి లేచి డాబా మీదకి వెళ్లారు.

రామారావ్ మనసు పీకుతూనే ఉంది. డాబా మీదకు వెళ్లగానే "ఎవర్రా ఆమె? అంత పొగరుగా ఉంది?" అన్నాడు.

గోపాలం కేం చెప్పాలనిపించలేదు. "ఎమ్మెల్యే గారమ్మాయి. ఆ ఇంట్లో ఉంటున్నారు". అన్నాడు.

"అలాటి వాళ్లనెందుకిక్కడుంచారు?" అన్నాడు. ఆ టాపిక్ కట్ చేసి "మీ పెద్దాడెక్కడికెళ్లాడురా? కనిపించటంలేదు?" అన్నాడు తానొచ్చిన పనిని తేల్చు కుందామని.

"ఇంట్లోనే ఉన్నాడన్నయ్యగారూ! వాడి పెళ్లామే ఆవిడగారు" కాంతం సమాధానం చెప్పింది. రామారావు కాంతం మాటలకి పలబారినట్లయ్యాడు. ఊపిరి అందక గిలగిల కొట్టుకుంటున్నట్లయ్యాడు.

"మరి ఎమ్మెల్యే కూతురంటావేరా ? పెళ్లికి శుభలేఖ అయినా పంపలేదేరే ?" తొట్రుపాటుతో అడిగాడు

"ఏంచెప్పమంరా కొడుకుపోయి నువ్వు జీవచ్ఛవంలా అయిపోతే కొడుకు ఉండి నేను జీవచ్ఛవాన్నయ్యాను. వాడి మీద కొండంతాశని పెట్టుకుని నానా బాధలూపడి వాడిని చదివించాను" 'వాడేమో ఆ ఎమ్మెల్యే కూతురి వల్లో పడ్డాడు. పోనీ, వాడిష్టం ఎందుకు కాదనాలి? అని చేసాం. వచ్చిన మరునాట్నించి ఆవిడ నాటకం అది. మేమంతా ఆమె దృష్టిలో పురుగులం. నా ఉద్యోగం పోయిందగ్గర్నుంచి హీనంగా చూస్తోంది"

గోపాలం చెపుతున్నమాటలు రామారావుని పిచ్చివాణ్ణి చేశాయి. కొండంత ఆశతో వచ్చిన రామారావు ఆశ తెగిపోయింది. ఆకాశం నేపు చూస్తున్నాడు. అనేకమైన నక్షత్రాలు కనిపిస్తున్నాయి. మనిషిలో ఆశలలా. అప్పుడే చుక్క రాలి క్రింద పడుతోంది. బయట పెట్టుకోలేక పోయిన వాళ్ల కోరికలా! తమ జీవితాల్లాటి శూన్యంలోకి చూస్తూ ఉండిపోయారు మిత్రులిద్దరూ! ●



# రామారావు మాష్టారికి గోపీచంద్ అవార్డ్

సెప్టెంబర్ ఎనిమిదవ చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఒక ముఖ్యమైన సభజరిగింది. ఒక విధంగా ఈ సభ చరిత్రాత్మకమైంది కూడాను. ఏ అవార్డులూ పుచ్చుకోని కాళీపట్నం రామారావు మాష్టారికి గోపీచంద్ అవార్డు ప్రదానం చేసి ఆయన్ని సన్మానించడానికి ఏర్పాటుచేసిన సభ ఇది.

గోపీచంద్ అవార్డులో ఒక గమ్మత్తైన విషయముంది. ఈ సభలలో ప్రసంగించే వక్తలకు చాలామందికి సన్మానితుడైన రచయిత గురించి ఏమీ తెలియకపోవడం అవార్డుల ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

మొదట గోపీచంద్ అవార్డు రావిశాస్త్రి గారికి (1917)లో ఇచ్చినపుడు వక్తలైనఅక్కినేని నాగేశ్వర రావు గారు, బి.ఎన్.రెడ్డి గారు, కొండవీటి వేంకట కవిగారు తామెవరూ రావిశాస్త్రిగారి రచనలు చదవలేదన్నారు. అలాగే ఈ ఏడాది కూడా అధ్యక్ష స్థానంలో ఉన్న ఎస్.ఎన్.రెడ్డిగారు, జస్టిస్ చల్లా కొండయ్యగారు తాము కాళీపట్నం రచనలను చదవలేదని తామే ఒప్పుకున్నారు.

మరి వీరినెందుకు ఆహ్వానించినట్టు?

ఒక ప్రముఖ రచయితకు ఒక పురస్కారం ఇచ్చేప్పుడు, ఆ కథలో ప్రశంసించే వక్తలకు కనీసం ఆ రచయిత రచనలకు పరిచయం ఉండాలి. అథమపక్షం రచయితతో వ్యక్తిగత పరిచయమైనా ఉండాలి.

రచనల గురించిగానీ, రచయిత గురించి గానీ తెలియని, తెలుసుకోడానికి సభరోజైనా ప్రయత్నించని ప్రముఖులను సభకు ఆహ్వానించడంలోని ఔచిత్యమేమిటి?

ఇక సభ విషయానికొస్తే యథాలాపంగా చేసిన ప్రసంగాలను రిపోర్టుచేసిన దినపత్రికలు సభలో పేలిన 'బాంబు'ను విస్మరించాయి.

ఆ పేలిన బాంబు వివరాలివి.

పురాణం గారు తమ ప్రసంగంలో 'యజ్ఞం' ప్రచురణ తాలూకు నేపథ్యం గురించి చెప్పారు. 65–66 ప్రాంతాలలో కాబోలు కాళీపట్నం మాష్టారు ఆ కథను 'యువ' దీపావళి సంచికకు పంపారు. ఆ రోజుల్లోనే రావిశాస్త్రి గారు 'బుక్కులు' కథను యువకు పంపారు.

అప్పట్లో గోపీచంద్ యువ చూసేవారు.

దాదాపు ఏడాదైనా 'యజ్ఞం' కథగానీ, బుక్కులు గానీ ప్రచురణకు నోచుకోలేదు. 'యువ' వారు ఆ కథలను తిప్పికూడా పంపలేదు. ఎవరైనా కళ్ళ కద్దుకుని తీసుకునే ప్రసిద్ధుల కథలే ఈ అనిశ్చిత స్థితిలో పడ్డాయి.

ఇదాలావుండగా కొడవటిగంటి కుటుంబరావు గారు నేరేపని మీద విశాఖ వచ్చారు. రైల్వేల నుండి అప్పుడేవచ్చిన పురాణంగారూ, కాళీపట్నం మాష్టరూ, మరికొందరూ కొ.కు.ని కలిశారు. సందర్భ వశాత్తూ త్రిశంకు స్వర్గంలో ఉన్న తన కథ గురించి రామారావు మాష్టారు చెప్పారు.

'యజ్ఞం' కథ చదివించుకుని విన్న కొ.కు బాధ పడి హైదరాబాదు వెళ్ళి గోపీచంద్‌గారిని మందలించారు. తత్ఫలితంగా పంపిన ఏడాత్తర్వాత మళ్ళీ దీపావళికి యజ్ఞం యువలో వచ్చింది. అలాగే బుక్కులు కూడా వెలుగు చూశాయి.

"ఇప్పుడు గోపీచంద్ పేరిట ఉన్న అవార్డును స్వీకరించడం ద్వారా అప్పట్లో గోపీచంద్ వల్ల జరిగిన పొరపాటును కాళీపట్నం మాష్టారు క్షమించారు" అన్నారు పురాణం. గోపీచందైనా, ఎవరైనా ఇటువంటి పొరపాట్లు చేయొచ్చా? పోనీ గోపీచంద్ అలా చేయలేదేమో అనుకోడానికి పురాణంగారు ఈ విషయం చెప్పింది కాళీపట్నం మాష్టారు సమక్షంలో నిండు సభలో— ఆలోచించవలసిన విషయం కాదూ?

—ఫణికుమార్